ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -311 పేజీలు - 8 వెల - 03/- గురువారం26 ఫిబ్రవరి 2026

# పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి

## వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు



- వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్
- పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం
- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా

**మార్కాపురం,ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మిగతా 2లో.



# ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

హమాస్ దాడిని ఖండిస్తున్నాం ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలుస్తాం

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

: ఆ దేశ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం బహిష్కరించిన ప్రతిపక్షాలు



**జెరూసలేం :ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
ఉగ్రవాద పోరులో అండగా ఉంటామనీ, ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్‌లో హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ ఖండించారు. హమాస్ దాడిని అనాగరిక చర్యగా విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని చెప్పారు. రెండురోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆ దేశ పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించారు. హమాస్ దాడి గురించి మాట్లాడుతూడ ”మీ బాధను మేం అనుభవిస్తున్నాం. మీ బాధను పంచుకుంటాం. ప్రస్తుతం, భవిష్యత్‌లో కూడా ఇజ్రాయిల్‌పై పూర్తి నమ్మకంతో ధృఢంగా మిగతా 2లో.

# తెలంగాణలో హత్యా రాజకీయాలు



- : కుమ్మెర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్


2లో.

# 8వ తరగతి పాఠ్యాంశంలో ’న్యాయవవస్థలో అవినీతి’

పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు

వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో ’న్యాయవవస్థలో అవినీతి’ అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని మిగతా 2లో.






# జగన్ చేసేనిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పాలా

హెరిటేజ్‌కు వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

బొత్స దృష్టిలో గజదొంగ అంటే జగనా

మీడియా చాట్‌లో లోకేశ్


**అమరావతి,ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. మిగతా 2లో.



# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన



2లో.

# సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.



# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

కడియం, దానంలపై తుది విచారణ

-27,28 తేదీల్లో విచారణకు సిద్ధం

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**
తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్టుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. మిగతా 2లో.



# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

- నందిపల్లి గ్రామంలోని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జగన్
- భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందని వ్యాఖ్య
- ఆలయ కమిటీని అభినందించిన జగన్



2లో.

# ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

భారత్ నిలుస్తుంది" అని మోడీ చెప్పారు. ప్రజలను చంపడాన్ని, ఉగ్రవాదాన్ని ఏ కారణమూ సమర్థించదని అన్నారు. "భారత్ కూడా ఉగ్రవాద బాధను భరించింది. 26/11 ముంబయి దాడుల్లో ఇజ్రాయిల్ పౌరులతో సహా అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను మేం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాం. ఉగ్రవాదంపై సహనం లేని, రాజీలేని విధానాన్ని మేం కలిగి ఉన్నాం. ఇందులో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలూ లేవు" అని మోడీ తెలిపారు. శాంతి మార్గం ఎల్లప్పుడూ సులభం కాదని, కానీ ఈ ప్రాంతంలో చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం ఇజ్రాయిల్‌తో ప్రపంచంతో పాటు భారత్ కలిసి ఉంటుందని మోడీ చెప్పారు.

ఈ ప్రాంతంలో శాంతికి యూఎన్ భద్రతా మండలి ఆమోదించిన గాజా శాంతి ఒప్పందం ఒక మార్గాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. భారత్‌లో యూదు ప్రజలు ఎలాంటి హింస, వివక్ష లేకుండా జీవిస్తున్నారని చెప్పారు. "భారత్‌లో యూదులు తమ విశ్వాసాలను కాపాడుకు న్నారు. సమాజంలో పూర్తిగా కలిసిపోయారు" అని మోడీ తెలిపారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో భారత్, ఇజ్రాయిల్ వంటి విశ్వసనీయ భాగస్వాముల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం చాలా ముఖ్యమని కూడా మోడీ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనీ, మరోవైపు ఇజ్రాయిల్ ఆవిష్కరణ, సాంకేతిక రంగాలల్లో శక్తివంతమైన దేశమని చెప్పారు. భారత్, ఇజ్రాయిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యమని మోడీ అన్నారు. మోడీకి ఇజ్రాయిల్ పార్లమెంట్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం'ను ప్రదానం చేసింది. నెస్సెట్ అత్యున్నత గౌరవంగా భావించే ఈ పతకాన్ని భారత్-ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి చేసిన అసాధరణ కృషికి గుర్తింపుగా ప్రదానం చేస్తున్నట్టు పార్లమెంట్ తెలిపింది.

**మోడీ ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు**

భారత ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో గందరగోళం చెలరేగింది. ఇజ్రాయిల్‌లోని ప్రతిపక్ష పార్టీలు నెస్సెట్ (ఇజ్రాయిల్ పార్లమెంట్)లో మోడీ ప్రసంగాన్ని బహిష్కరించాయి. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా నిర్ణయంతో వివాదం ప్రారంభమైంది. నెతన్యాహు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను విస్మరిస్తోందని, దీనితో భారత ప్రధాని ప్రసంగానికి హాజరు కాకూడదని నిర్ణయించాయి. ప్రతిపక్షాల బహిష్కరణతో భారత ప్రధాని పర్యటన చుట్టూ అసౌకర్య వాతావరణాన్ని ఏర్పర్చింది. మోడీ ప్రసంగించే సమయంలో పార్లమెంటులో సగం సీట్లు ఖాళీగా ఉండటం ప్రతికూల సందేశాన్ని పంపినట్టయ్యింది. ఈ పరిస్థితిని నివారించడానికి ఉన్న సభ్యులను నిలబెట్టి మోడీ..మోడీ అంటూ నినాదాలు చేయించటం గమనార్హం.

**ఇజ్రాయిల్‌లో రెండోసారి పర్యటించిన మోడీ**

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం "ఇజ్రాయిల్ , భారత్ మధ్య అద్భుతమైన పొత్తు ఉన్నది. మేం అన్ని రకాల సహకారాన్ని చర్చించబోతున్నాం" అని వివరించింది. గతేడాది ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్ , భారత్ పరస్పర వాణిజ్యాన్ని విస్తరించడానికి పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేశాయి. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి అనాగరికమంటూ తీవ్రంగా ఖండించారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమంలో చిన్నారులు మహిళలుసహా 75 వేలమందికిపైగా ప్రాణాలు కోల్పోయినా, దాని గురించి తన ప్రసంగంలో మోడీ ప్రస్తావించకపోవడం గమనార్హం.

**ప్రధాని మోడీ అండగా నిలిచారు**

ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో సభ్యులు లేచి నిలబడి ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు పార్లమెంట్‌లోని అతిథుల పుస్తకంలో మోడీ సంతకం చేశారు. మోడీని పొగడ్తలో ముంచెత్తిన నెతన్యాహు, 'ప్రధాని మోడీ మనకు అండగా నిలిచారు.' ఇజ్రాయిల్‌కు మంచి మిత్రుడు అని వ్యాఖ్యానించారు. దాదాపు 150కోట్ల మంది ప్రజా శక్తి కలిగిన భారత్ మహత్తరమైన శక్తి కలిగిన దేశం. దానితో పోలిస్తే ఇజ్రాయిల్ చాలా చిన్నది, అయినా శక్తివంతమైనదే, మన రెండు దేశాల మధ్య పొత్తు మన వ్యక్తిగత శక్తుల కన్నా అనేక రెట్లు ఎక్కువ. మీరు మాతో నిలిచారు." అని నెతన్యాహు పార్లమెంట్ నుద్దేశించి మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

# పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి



పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ చేసేనిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పాలా

ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు.

జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకి తానెందుకు సమాధానం చెప్పాలి..? అని నిలదీశారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు. జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నారా? అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేకు ఓ యూనివర్సిటీ పెట్టామని, రెసిడెన్షియల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియేనీటేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు అని ప్రస్తావించారు. తాము అంతా విద్యార్థులమేనని.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావేశాలు.. రాజకీయాలకు అతీతమని... ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరించారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో హత్యా రాజకీయాలు

మహబూబ్‌నగర్ **ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతిచెందిన ఘటనపై నాగర్‌కర్నూల్‌లో జరుగుతున్న ధర్నా శిబిరానికి పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ తదితరులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో మాటలకందని మహా విషాదం చోటు చేసుకుందని, సభ్య సమాజం తలదించుకునేలా పెత్తందార్ల వ్యవహార శైలి ఉందని అన్నారు. గుండెలు అవిసిపోయేలా హృదయవిధారకమైన ఘటన జరిగినప్పటికీ పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం అప్రజాస్వామికమని తెలిపారు.

పేదలు దర్శనానికి వెళితే మరణ శాసనం లిక్కించిన పెత్తందారులను జైళ్లకు పంపాల్సిందేనన్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు జరిగినప్పుడు పోలీసులు సుమోటోగా కేసును స్వీకరించాల్సింది పోయి బాధితులు దరఖాస్తు పెట్టినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పసిపాపకు పాలు పట్టాల్సిన తల్లి కన్నీరు పెట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి వెళ్లిన వారిని కులం పేరుతో అడ్డుకుని దాడి చేయడమే కాకుండా, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో పాలకులు రాజ్యాంగాన్ని సైతం ఖననం చేశారని, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ సామాన్యులకు న్యాయం దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసికందు మృతికి కారణమైన ఎనిమిది మంది నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమాల పురటి గడ్డలో ఇలాంటి ఘటన దారుణం : గోరటి వెంకన్న**

ప్రముఖ నాయకులు, మాజీ మంత్రి మహేంద్రనాథ్‌తో పాటు అనేక ఉద్యమకారులకు పురుడు పోసుకున్న ఈ నేలలో పసికూనను పొట్టన పెట్టుకోవడం దారుణమని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. పాలకులు ఎవరైనా సామాజిక బాధ్యతను విస్మరించరాదన్నారు. దోషులను అరెస్టు చేసి సామాజిక న్యాయాన్ని కాపాడే విధానం ఇక్కడినుండే ప్రారంభం కావాలని తెలిపారు. ఉద్యమాల చిరునామాగా నిలిచే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం దారుణమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

**పసికందు మరణంపై సీఎం స్పందించాలి : భూపాల్**

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. ప్రపంచం నివ్వెర పోయేలా పోలీసులు, అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ జిల్లా వాసిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి పసిపాప మరణంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యా నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మర్రి జనార్దన్ రెడ్డి, అంతటి కాశన్న, బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

## రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే

## అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు

### మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

న్యూయార్క్,**ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

కడప **ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**



కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు.కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, ఇతర సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'

భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# నిఘా వలయంలో ఇంటర్ పరీక్షల నిర్వహణ..

## డ్రోన్లతో పహారా కాస్తున్న అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగం..







**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 25 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల గట్టి భద్రతతో పాటు నిఘా పరికరమైన అత్యాధునిక డ్రోన్ కెమెరాల సహాయంతో తమ పర్యవేక్షణ ను ముమ్మరం చేశారు.

**డ్రోన్ సర్వేలెన్స్..**
పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ, గుంపులుగా ఉన్న వారిని మరియు అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తున్నారు.

**సెక్షన్ 144 అమలు..**
పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**క్రమశిక్షణే లక్ష్యం..**
మాస్ కాపీయింగ్ జరగకుండా మరియు విద్యార్థులకు ఆటంకం కలగకుండా టెక్నాలజీని వాడుతూ పోలీస్ నిఘాను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ల నిఘా కూడా ఉంటుంది. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు..

# జగన్ రాకతో పులకరించిన నందిపల్లి గ్రామం..

**- వేలాదిమంది హోరున నినాదాలతో స్వాగతం..**

**- శ్రీశ్రీశ్రీ పార్వతీదేవి సమేత మహానందీశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపనకు - ఏపీ మాజీ సీఎం**

**- భక్తి మార్గం ద్వారానే శాంతి, సౌభ్రాతృత్వం.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి**

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- కడప జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేంపల్లె మండల కేంద్రమైన నందిపల్లి గ్రామ సమీపంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి చొరవతో వెలసిన నందీశ్వర ఆలయం లో బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న శాస్త్రోక్త కార్యక్రమాల్లో భాగంగా వేకువ జామున నుండే వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల సహస్రస్తాలతో స్వామి వారిని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామివారికి వివిధ పూజ, హోమాది కార్యక్రమాల నడుమ నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమం కనివిని ఎరుగని రీతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. భారీ భద్రత నడుమ ఆలయం వద్దకు విచ్చేసిన వైయస్ జగన్



ను భాజా భజంత్రీలతో, వేద పండితులు వేదమంత్రాలను పఠిస్తూ పూర్ణ కుంభాలతో ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాల్లో సంప్రదాయమైన దుస్తులు ధరించి తలపాగా చుట్టుకొని వివిధ పుష్పాలను శిరస్సుపై పెట్టుకొని ఊరేగుతూ వేద పండితులకు అందజేశారు. తదనంతరం స్వామివారికి నియమ నిష్టలతో, భక్తిశ్రద్ధలతో, క కఠోర ఉపవాస దీక్షతో జరిగిన అభిషేకాలు, కలిశ పూజ, హోమాది కార్యక్రమాల్లో పాల్గొని వైయస్ జగన్ చేతుల మీదగా పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. అనంతరం వేదపండితులచే వేదాశీర్వచనం స్వీకరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్టాపన క్రతువును దగ్గరుండి వీక్షించిన ఆయన ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. మొత్తం రూ. 6 కోట్ల వ్యయంతో ఈ ఆలయం రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని జగన్ తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, కమిటీ సభ్యులను జగన్ అభినందించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని జగన్ ఆకాంక్షించారు. నందిపల్లి కార్యక్రమం ముగించుకొని అనంతరం జగన్ తిరిగి పులివెందులకు చేరుకున్నారు. అక్కడ భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితులు, నాయకులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రికి పులివెందుల నివాసంలోనే బస చేసి గురువారం బెంగళూరుకు వెళ్లనున్నారని వైయస్ అవినాష్ రెడ్డి తెలిపారు..

# గురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

**గుత్తి ఫిబ్రవరి 25( రిపబ్లిక్ న్యూస్)**
గుత్తిలోని గురుకుల బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ స్వాతి తెలిపారు. పదో తరగ తికి గణితం, భౌతికశాస్త్రం బోధించేందుకు ఎమ్మెస్సీ ఫిజిక్స్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవా లని ఆమె కోరారు. మరింత సమాచారం కోసం 8712625063 నంబరును సంప్రదించాలని తెలిపారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీకి యువతకు ఆహ్వానం

## ప్రజా సమస్యలపై పోరాడే వారికి వేదికగా కాంగ్రెస్ మార్చి 10లోపు దరఖాస్తులు ఆహ్వానం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**



కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ఆశావహులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పత్తికొండ నియోజకవర్గ కోఆర్డినేటర్, న్యాయవాది క్రాంతి నాయుడు బోయ తెలిపారు.బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి విడుదలైన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచనలు మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 10వ తేదీలోగా జిల్లా కాంగ్రెస్ కమిటీ కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.జిల్లాలోని యువకులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, సామాజిక సేవకులు మరియు ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీలో చేరి జిల్లా కాంగ్రెస్ కమిటీతో పాటు అనుబంధ విభాగాలైన జిల్లా మహిళా కాంగ్రెస్, డాక్టర్ సెల్, లీగల్ సెల్, కల్చరల్ సెల్, టీచర్స్ సెల్, ఆర్‌జీపీఆర్ఎస్, డాటా అనాలిసిస్ విభాగం, కంట్రోల్ రూమ్, ఎక్స్ సర్వీస్‌మెన్ విభాగం, గ్రీవెన్స్ సెల్, మీడియా ప్యానలిస్ట్, ఆర్ అండ్ డి, సోషల్ మీడియా, ట్రైనింగ్ విభాగం, అనార్గనైజ్డ్ విభాగం తదితర శాఖలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేరుగా లేదా 85208 88388 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపవచ్చని, మరిన్ని వివరాలకు పై నంబర్‌కు సంప్రదించాలని క్రాంతి నాయుడు బోయ సూచించారు.

# ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు సతీమణి ఉమాదేవి పాల్గొనడం విశేషం

## రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ హాజరు

**మడకశిర, (రిపబ్లిక్ న్యూస్) ఫిబ్రవరి 25**



మడకశిర పట్టణంలోని బుల్ల సముద్రం గ్రామంలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు సతీమణి ఎం.ఎస్. ఉమాదేవి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటి గ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా లీగల్ సెల్ రాధాకృష్ణతో పాటు స్థానిక నాయకులు నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు నరేష్ కన్నా, కన్వీనర్లు నాగరాజు, గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప, క్లస్టర్ ఇన్చార్జులు రంగే గౌడ్, జైపాల్ నాగేష్ పాల్గొన్నారు. నాయకులు తమ ప్రసంగంలో అంబేద్కర్ సేవలను స్మరించారు. ఆయన చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొని, కొలంబియా విశ్వవిద్యాలయం మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి డాక్టరేట్ పట్టాలు పొందారని, అంటరానితనం నిర్మూలన కోసం ఉద్యమాలు నిర్వహించి, దళితుల హక్కుల కోసం 'బహిష్కృత హితకారిణి సభ' స్థాపించారని వివరించారు.మహద్ సత్యాగ్రహం వంటి ఉద్యమాలతో సమాజంలో సమానత్వం కోసం పోరాడిన అంబేద్కర్, భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా ఆధునిక భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. ఆయన సేవలకు గాను 1990లో భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నతో సత్కరించిందని పేర్కొన్నారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలు అంబేద్కర్ ఆలోచనలను మరింతగా ఆచరణలో పెట్టాలని, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను కాపాడాలని నాయకులు పిలుపునిచ్చారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ వాష్ అండ్ గో'

## అర్ధరాత్రి తనిఖీలు ముమ్మరండ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న కర్నూలు పోలీసులు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**



రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు వాహనాలను ఆపి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘ ప్రయాణాలు చేసే డ్రైవర్లలో అలసట తగ్గించేందుకు వారికి నీళ్లతో ముఖం కడిగించి అప్రమత్తంగా ప్రయాణం కొనసాగించేలా సూచిస్తున్నారు.జిల్లాలోని ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, కర్నూలు సబ్‌డివిజన్ల పరిధిలో ఉన్న జాతీయ రహదారులపై లారీలు, ప్రైవేట్ ట్రావెలింగ్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు.అతివేగం వద్దని, రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని పోలీసు అధికారులు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

# నేర నియంత్రణే లక్ష్యంగా కఠిన చర్యలు

## : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ -డ్రోన్ పెట్రోలింగ్‌కు ఆదేశాలు - డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా - విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**
కర్నూలు జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నేర నియంత్రణే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని సూచించారు. నేర నివారణే పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని పేర్కొన్నారు.కార్డన్ సెర్చ్‌లు, రాత్రి గస్తీలు, రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్, పల్లె నిద్ర కార్యక్రమాలు, గ్రామాల సందర్శనలు, ఆకస్మిక తనిఖీలు, బైండోవర్‌లు, పీడీ యాక్టులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై జిల్లా బహిష్కరణలు, పీడీ యాక్టులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.
గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్, చీటింగ్, దొంగతనాలు, ప్రాపర్టీ కేసులపై సమీక్ష నిర్వహించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పెట్రోలింగ్ వాహనాలతో సైరన్లు, లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీలు పెంచాలని ఆదేశించారు.
పోక్సో కేసుల్లో నిర్దేశిత గడువులోనే ఛార్జ్‌షీట్లు వేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి







కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించాలని చెప్పారు.డీజీపీ చేపట్టిన "వజ్ర ప్రహర్" కార్యక్రమంలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేయాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలు నిర్వహించడంతో పాటు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతంగా అమలు చేయాలని, ప్రతి సబ్ డివిజన్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టాలని చెప్పారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.సైబర్ నేరాల ఫిర్యాదులు వచ్చిన వెంటనే కేసులు నమోదు చేయాలని, పెండింగ్ కేసుల దర్యాప్తులను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై రాత్రి వేళల్లో హెవీ వాహన డ్రైవర్లకు "స్టాప్, వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.
అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ రాత్రి గస్తీ సమయంలో పోలీసులు రేడియం జాకెట్లు, ఎల్ఈడి బ్యాటన్స్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.గత నెలలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బంది, డిపిఓ మినిస్టీరియల్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.
ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, భార్గవి, డిపిఓ ఏఓ విజయలక్ష్మి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# 2020 బ్యాచ్ ఎంబిబిఎస్ విద్యార్థుల రక్తదానం శిబిరం

## త్వరలో పట్టాలు అందుకోనున్న వైద్య విద్యార్థుల

## సేవా స్ఫూర్తి ప్రతి మెడికో ముందుకు రావాలని ప్రిన్సిపాల్ పిలుపు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**



కర్నూలు మెడికల్ కాలేజీలో 2020లో ఎంబిబిఎస్‌లో అడ్మిషన్ పొంది వైద్య విద్యను పూర్తి చేసి త్వరలో మెడిసిన్ పట్టా అందుకోనున్న విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ఏడీఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అన్నారు.

బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు వైద్య సేవల ద్వారా మాత్రమే కాకుండా రక్తదానం ద్వారా కూడా ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి వైద్య విద్యార్థి ఇలాంటి సేవా సంప్రదాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన 2026 అవుట్‌గోయింగ్ బ్యాచ్ త్వరలో అరొక్-26 పేరుతో గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించుకోనుంది.

ఈ రక్తదాన శిబిరంలో జిజిహెచ్ గవర్నమెంట్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. షెహానాజ్, పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. శైల, 2ఖ20 బ్యాచ్ సీఆర్ డా. అభిషేక్, అఖిల్, శిరీష, స్వర్ణలత, ప్రవల్లిక, హరినాథ్, జైషన్, బాలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 7న బాలికల జిల్లా స్థాయి యోగా పోటీలు

## ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో నిర్వహణ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**




ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మార్చి 7వ తేదీన కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి బాలికల యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా యోగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్. ముంతాజ్ బేగం తెలిపారు.ఈ పోటీలను మూడు విభాగాలుగా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. 7 నుంచి 9 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఒక విభాగం, 10 నుంచి 13 సంవత్సరాల వారికి మరో విభాగం, 14 నుంచి 18 సంవత్సరాల వారికి మూడో విభాగంగా పోటీలు జరుగుతాయని వివరించారు.పోటీలలో పాల్గొనదలిచిన వారు మరిన్ని వివరాల కోసం సంఘం కార్యదర్శి మునిస్వామిని 7981515467 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

# పన్నుల చెల్లింపుకు ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

## యూపీఐ ద్వారా కూడా చెల్లింపులకు అవకాశం - కమిషనర్ పి. విశ్వనాథ్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**



పన్నుల చెల్లింపులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుముల చెల్లింపునకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయం, కేఎంసి పాత కార్యాలయం, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయం, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయం, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయం, లక్ష్మి నగర్, జెఎన్ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ప్రతి రోజు ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని పేర్కొన్నారు.యూపీఐ ప్లాట్‌ఫాంల ద్వారా కూడా పన్నులు చెల్లించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పన్నుదారులు బకాయిలను త్వరితగతిన చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక కౌంటర్లు, ఆన్‌లైన్ సేవా కేంద్రాల ద్వారా సౌకర్యవంతంగా పన్నులు చెల్లించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

# కోళ్ళ పై విష ప్రయోగం, సుమారు ఇరవై కోళ్ళు మృతి



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**

కోళ్ల పై విష ప్రయోగం చేయడంతో దాదాపు 20 కోళ్లు మృతి చెంది రూ 20 వేల వరకు నష్టం వాటిలినట్లు బాధ్యత రైతు తెలిపాడు ఆయన కథనం మేరకు...

మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల కుళ్ళాయి వెంకట్రమణ నాటు కోళ్లను పెంచుకుంటున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై ఉన్న కక్షతో కోళ్ల పై విష ప్రయోగం చేశారని వాపోయాడు ప్రస్తుత సమయంలో నాటు కోళ్ల పై పెట్టుబడులు పెట్టి చేసిన అప్పులు తీర్చుకుందాం అంటే గుర్తుతెలియని వ్యక్తులు విష ప్రయోగం చేసి మరింత అప్పుల పాలు చేశారని రైతు వెంకటరమణ వాపోయాడు.

# ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 25,( రిపబ్లిక్ న్యూస్):-** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు సంబంధించి రెండో రోజు బుధవారం జరిగిన పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ వెంకటనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో జనరల్ ఇంగ్లీష్ పేపర్ 1 పరీక్షకు 292 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 282 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ ఇంగ్లీష్ పేపర్ వన్ పరీక్షకు 56 మందికి గాను 51 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 348 మంది విద్యార్థులకు గాను 333 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షలు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో జరుగుతున్నాయని చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోసం త్రాగునీటి సౌకర్యాలను కల్పించామని ప్రిన్సిపల్ తెలిపారు.

# ఇంటర్ పరీక్షా కేంద్ర్రాల వద్ద పటిష్ట భద్ర్రతకు సన్నాహాలు..

## పరీక్ష కేంద్రం వద్దకు ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేపట్టిన - జిల్లాఎస్పీ

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- ఏపీ వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతిష్ట భద్రత నడుమ బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంతో పాటు, సంబేపల్లి మండల కేంద్రమైన ఎర్రగుంట్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షలు జరుగుతున్న తీరును, పోలీసు బందోబస్తును పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. "నిరంతర నిఘా – 144 సెక్షన్ అమలు" పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఖచ్చితంగా అమలు చేయాలని అపరిచిత వ్యక్తులు గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఒకవేళ గుంపు గుంపులుగా ఉంటే చదరగొట్టమని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి



పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.

**"జిరాక్స్ సెంటర్లపై హెచ్చరిక"**

పరీక్షా సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసి ఉంచాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**"విద్యార్థులకు భరోసా"**

విద్యార్థులు ఎటువంటి భయం లేదా ఒత్తిడికి



లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ భరోసా ఇచ్చారు. మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

**"పోలీస్ అధికారులకు సూచనలు"**

విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు, పరీక్షా సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

## నిత్య సమాజ సేవకుడు పాములపాడు కే.నాగరాజు కు ఘనంగా సన్మానం చేసిన

# మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న.

**పాములపాడు ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్:-**

మండల కేంద్రమైన పాములపాడుకు చెందిన నిత్య సమాజ సేవకుడు కలబండి.నాగరాజుకు ఆయన చేసిన సామాజిక సేవకు గుర్తింపుగా మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు డీవీఎంసీ మెంబర్ లింగాల.నాగరాజు, జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్, ముస్లిం మైనార్టీ సంఘం మండల అధ్యక్షుడు ఎస్.షేక్షాఅలి, బీసీ సంఘం నాయకుడు జి.సాయి కృష్ణ, సేవా భారతి (వై.ఆర్.డి.ఎస్) అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలి, తదితర నాయకులతో కలిసి శాలువా కప్పి, పూలమాల మెడలో వేసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కే.అంకన్న, డీవీఎంసీ మెంబర్ ఎల్.నాగరాజు, ముస్లిం మైనార్టీ సంఘం మండల అధ్యక్షుడు ఎస్.షేక్షాఅలీ, జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షుడు ఆర్.మురళీమోహన్, బీసీ సంఘం నాయకుడు జి.సాయి కృష్ణ, సేవా భారతి (వై ఆర్ డి ఎస్) అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలి, తదితర నాయకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కే.నాగరాజు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అభ్యున్నతి కొరకు, చెంచు గిరిజనుల జీవనోపాధి కొరకు అధికారులతో, ప్రజా ప్రతినిధులతో వినతి పత్రాలు



అందించి ఉపాధి హామీ పనులను కల్పించడం, వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం, వారికి ఆర్థిక సహకారం అందించడం, మతసామరస్యం కోసం, స్వాతంత్రం కోసం, విముక్తి కోసం కృషిచేసిన మహానుభావుల జయంతిలు, వర్ధంతిలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచడం వంటి అనేక అనేక సమాజ సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ప్రేమ వివాహాల సమస్యలను, కుటుంబాల సమస్యలను, ఆస్తుల సమస్యలను ఒక పెద్ద మనిషిగా ఆయన సామరస్యంతో పరిష్కారం చేయడం జరిగిందన్నారు. మొత్తానికి సమాజ సేవకుడు కె.నాగరాజు బహుజనుల రాజ్యాధికారం కొరకు కృషి చేయడం అనేది అందరికీ ఆదర్శమన్నారు. కనుక మనమందరము ఆయన మాదిరిగానే కులవతాలకతీతంగా, రాజకీయాలకతీతంగా, మానవత్వంతో, మతసామరస్యంతో కలిసి వెలిసి ఉండి, ఏకమై ఈ దేశంలో రాజ్యమేలుతున్న మూఢనమ్మకాలను, మూఢాచారాలను, వివక్షతలను రూపుమాపి, నియంతల పాలనకు స్వస్తి పలకాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తేనె.మల్లికార్జున, మైమాకర్, ప్రసాద్, శాలు భాష, చిన్న ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ పాస్టర్స్ ఆత్మీయ సమావేశంలో

# పాల్గొన్న సినీ హీరో రాజా ఎబెల్.



**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్.**

యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్స్ ఆత్మీయ సమ్మేళన సమావేశం బుధవారం ఘనంగా జరిగినది, ఈ సమావేశం రాజంపేట పట్టణంలో జీకే ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య, మరియు రైల్వే కోడూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి గోసాల దేవి పాల్గొనడం జరిగినది

ఈ సందర్భముగా, బ్రదర్ రాజు ఎబెల్ మాట్లాడుతూ, ప్రేమ కరుణ దయ మార్గములో మనిషి నడవాలని, వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని,తల్లిదండ్రులపట్ల భయభక్తులతో జీవించాలని యువత ఈ దేశానికి గొప్ప సంపదని, దేశ అభివృద్ధిలో మీ పాత్ర అతి ముఖ్యమని ఎంతో అవసరం అని యువత మంచి మార్గంలో నడవాలని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిగమాల రమేష్, రైల్వే కోడూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలమురలీకృష్ణ, పెదకల్లుడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త పి అనిల్ కుమార్ పార్థు, పెనగలూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోత్తురు అనీల్ కుమార్,రాజంపేట పార్లమెంట్ నాయకుడు కొండూరు పార్థ సారథి, రాజంపేట యూత్ నాయకుడు మన్నూరు తేజ, పలువురు కార్యదర్సులు పాల్గొనడం జరిగినది, అంతేకాకుండా పాస్టర్ పిల్లో హౌస్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ సర్దార్, బ్రదర్ మల్లీ మరియు రాజంపేట కోడూరు ప్రాంతాలకు చెందిన పాస్టర్స్ ఈ సమావేశంలో పాల్గొనడం జరిగినది.



# జిల్లాను వ్యతిరేకించిన నాయకులు ఎమ్మెల్యే ని ప్రశ్నించే హక్కు లేదు

## - పట్టణ కోశాధికారి విజయలక్ష్మి

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 25(,రిపబ్లిక్ న్యూస్ ):**

ఆదోని జిల్లా మరియు ఎమ్మిగనూరు జిల్లా ప్రకటన పై కొంతమంది వైసీపీ నాయకులు మాలమహానాడు నాయకులు అంటూ ఎమ్మెల్యే జిల్లా ప్రకటన కు అనుకూలమా వ్యతిరేకమా అంటూ ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నించడం జరిగింది. ఈ విషయంపై పట్టణ కోశాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ పార్టీలో కనీస గుర్తింపు లేని నాయకులు ఎమ్మెల్యే గారిని ప్రశ్నించి గుర్తింపు కోసం ఆరాటపడటం ఈ మధ్యకాలంలో కొంతమంది కి ఫ్యాషన్ అయిపోయింది అని ఆమె ఎద్దేవా చేశారు. విమర్శించే ముందు వారి స్థాయి ఏంటో తెలుసుకోవాలని ఆమె హితవు పలికారు. చార్ సౌ బీస్ గాళ్ళ ప్రశ్నలకు నేను సమాధానం చెప్తానంటూ ఆదోని జిల్లాకు



వ్యతిరేకమంటూ ఎమ్మెల్యే ఎక్కడైనా చెప్పారా అంటూ ఆమె ప్రశ్నించారు. ఎమ్మిగనూరు అన్ని నియోజకవర్గాల కంటే అన్ని అర్హతలు భౌగోళికంగా ఆర్థిక సామాజిక విద్య వైద్యం ఉపాధి వ్యాపారం వాణిజ్యం కి అనువైన ప్రాంతం కాబట్టి ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే ఎమ్మిగనూరు జిల్లా కావాలనుకోవడంలో తప్పులేదని తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధిని జిల్లా కేంద్రం ఏర్పాటు ని వ్యతిరేకించిన ప్రతిపక్ష పార్టీ నాయకులు మా ఎమ్మెల్యే ని ప్రశ్నించటం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఎమ్మిగనూరు జిల్లా వ్యతిరేకం అంటూ రేపు స్థానిక ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లే దమ్ము మీ పార్టీకి మీకు ఉందా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మునిసిపల్ కార్మికుల కారుణ్య నియామకాలను విస్మరిస్తే మా ఎమ్మెల్యే సీఎం గారితో చర్చించి పట్టుబట్టి పదమూడు మందికి కారుణ్య నియామకాలు తెచ్చిన మొనగాడు మా ఎమ్మెల్యే జయనగేశ్వరెడ్డి అని ఈ విషయం ఏ శాసనసభలో మాట్లాడలేదని మా ఎమ్మెల్యే గారు మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధిని చూపించే వ్యక్తి అని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి దమ్ము ధైర్యము మాకంటే తొమ్మిది సంవత్సరాలు టిడిపి కండువా మోసిన మీకే బాగా తెలుసు అని ఆమె దుయ్యాబెట్టారు. కేవలం గుర్తింపు కోసం ఎమ్మెల్యే గారిపై ప్రెస్ మీట్ లు పెడితే మీ గురించి ప్రెస్మీట్లను ఇతరులు పెట్టాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

# రెవెన్యూ క్లినిక్‌లపై రైతుల ఆగ్రహం

## భూ సమస్యలు ఇంకా పెండింగ్



### అంకెల్లో పురోగతి చెప్పుకుంటున్న యంత్రాంగం

### ఆర్.ఓ.ఆర్, 22-ఏ కేసులే ఎక్కువగా నిలిచిపోయినవి

### ఆన్లైన్ రికార్డుల మార్పులపై బాధితుల ఆందోళన

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్, ఫిబ్రవరి 25):**
కర్నూలు జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రారంభించిన “రెవెన్యూ క్లినిక్”లు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూమి రక్షణకు కీలకంగా ఉండాల్సిన రెవెన్యూ వ్యవస్థలోనే లోపాలు కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల రెవెన్యూ కార్యాలయాల్లో నిర్లక్ష్యం, ఆలస్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు బాధితులు చెబుతున్నారు.
ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ, క్లిష్టమైన భూ హక్కుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకుండా పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని విమర్శలు వస్తున్నాయి. చిన్న స్థాయి సేవలను మాత్రమే పరిష్కరించి విజయవంతమని చూపిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

#### పెండింగ్ అర్జీలు అధికం

డిసెంబర్ 29 నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,225 అర్జీలు నమోదు అయ్యాయి. వీటిలో అధికారులు పరిష్కరించామని తెలిపింది 681 మాత్రమే కాగా, ఇంకా 544 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.




దాదాపు 45 శాతం ఫిర్యాదులు ఇంకా పరిష్కారం కాలేదని గణాంకాలు సూచిస్తున్నాయి.

#### ఆర్.ఓ.ఆర్, 22-ఏ కేసులే క్లిష్టం

భూమి హక్కులకు సంబంధించిన రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్.ఓ.ఆర్) దరఖాస్తులే ఎక్కువగా నిలిచిపోయాయి. మొత్తం 664 అర్జీలలో 315 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. పట్టాదారు పాస్‌బుక్లలో పొరపాట్లు, ఆన్లైన్ పేర్ల మార్పులు వంటి సమస్యలు పరిష్కారంలో ఆలస్యం అవుతోందని రైతులు చెబుతున్నారు.

#### ఇతర విభాగాల పరిస్థితి ఇలా ఉంది ...

సర్వే దరఖాస్తులు: 111లో 60 పెండింగ్
22-ఏ తొలగింపు: 182లో 55 పెండింగ్
అసైన్మెంట్ భూములు: 108లో 46 పెండింగ్

#### డివిజన్ల వారీగా పరిస్థితి

పెండింగ్ ఫిర్యాదుల్లో కర్నూలు డివిజన్ ముందంజలో ఉంది.కర్నూలు డివిజన్: 503లో 251 పెండింగ్
ఆదోని డివిజన్: 346లో 171 పెండింగ్
పత్తికొండ డివిజన్: 376లో 122 పెండింగ్
మండలాల వారీగా కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కర్నూలు అర్బన్, ఆదోని ప్రాంతాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

#### బాధితుల ఆవేదన

ఆన్లైన్ భూ రికార్డుల్లో అక్రమ మార్పులు జరుగుతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలానికి చెందిన ఒక కుటుంబం 34 ఎకరాల భూమిపై దొంగ సర్వేలు చేసి రికార్డులు మార్చారని ఆరోపిస్తోంది. అలాగే ఆలూరు మండలం ముద్దనగేరిలో కొనుగోలు చేసిన భూమికి నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించారని బాధితులు పేర్కొంటున్నారు. దేవనకొండ మండలంలో కూడా ఆన్లైన్లో పేర్లు అక్రమంగా మారుతున్నాయనే ఫిర్యాదులు రావడం రైతుల్లో ఆందోళన పెంచింది. “రికార్డులు ఇంత సులభంగా ఎలా మారుతున్నాయి?” అని వారు ప్రశ్నిస్తున్నారు.

#### ప్రత్యేక చర్యల కోసం డిమాండ్

కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆర్.ఓ.ఆర్, 22-ఏ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారితో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే రెవెన్యూ క్లినిక్‌లకు నిజమైన ప్రయోజనం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.



## కూటమి ప్రభుత్వంలో గ్రామాల రోడ్లకు మహర్దశ..

### సుమారు 47 లక్షల ఎంజీఎన్ఆర్జీఎస్ నిధులతో పల్లె రోడ్డు పనుల ప్రారంభం..



**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 25 - (రిపబ్లిక్ న్యూస్)** -మదనపల్లి :- ములకలచెరువు మండల కేంద్రమైన దేవలచెరువు గ్రామ పంచాయితీ చెన్నుగారిపల్లి, కాలువ వారి పల్లి గ్రామాలకు రూ. సుమారు 47 లక్షల ఎంజీఎన్ఆర్జీఎస్ నిధులతో పల్లె రోడ్డు మహర్దశకు పూనుకుంది. పల్లె ప్రజలు బాగుండాలని భావిస్తూ కూటమి ప్రభుత్వ లక్ష్యం తో సీసీ రోడ్డు వేస్తున్నామని టీడీపీ సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజ్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కె.వి రమణ పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణుల ఐక్యంతో రోడ్డు పని చేపట్టే ముందుగా కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమం నిర్వహించి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో హరి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పల్లె ప్రజల సౌకర్యార్థం మరిన్ని గ్రామాల్లో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని కూటమి ప్రభుత్వంలో గ్రామాల రోడ్డు పనులకు మహర్దశకు పూనుకుంటా ఉందని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు చాంద్ బాషా, రవిచంద్ర, రమణారెడ్డి, నాయకులు కేశవరెడ్డి, తిరుమలరెడ్డి, ఎర్రంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివారెడ్డి, బూత్ కన్వీనర్ కొట్టం శ్రీనివాసులు, మునుస్వామి, బ్రహ్మారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, పి శ్రీనివాసులు, రెడ్డప్ప, రమణమూర్తి, బుడుగు శంకర, రాము, నాగరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు..

## ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి గోడ పత్రికలు విడుదల



**చిప్పగిరి, ఫిబ్రవరి, 25,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి నందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఉల్లాస్ అక్షర కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు బుధవారం ఎంపీడీవో అల్లా బకాస్ ఆధ్వర్యంలో విడుదల చేశారు, ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం యొక్క లక్ష్యం 2029 నాటికి వయోజనాలందరిని అక్షరాసులుగా మార్చడమే నని ఈ పథకం ద్వారా 15 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న నిరక్షరాశులకు ప్రాథమిక విద్య అందించబడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం శివయ్య, ఎనర్జీ ఎస్ ఏపీఓ జుబేర్ అహ్మద్, టి ఏ లు మారుతి, శర్మాస్ , నాగేంద్ర, రమేష్, రాంప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్లు యాసిన్ కాజా, మున్నా, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ పాల ఘటన.. పాల కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 25,( రిపబ్లిక్ న్యూస్):-** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కల్తీ పాల వ్యవహారం పై అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందు జాగ్రత్తగా చర్యగా పశుసంవర్ధక శాఖ అధికారులు పాల కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా వెలుగోడు సబ్ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్. ఆకుల వెంకటేశ్వర్లు బుధవారం బండి ఆత్మకూరు మండలంలో పర్యటించారు. మండలంలోని భోజనం, పెద్దదేవలాపురం గ్రామాల్లో పాల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారి పాల సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత అందులో ఉన్న శాంపిల్స్, మిల్క్ టెస్టర్, వేయింగ్ మిషన్, లాక్టోమీటర్ను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆయన పాడి రైతులతో కూడా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పశు పోషణ పై పాడి రైతులు చేపట్టాల్సిన అంశాలు, పాలు కేంద్రానికి పోసే సమయంలో చేపట్టాల్సిన శుభ్రత, జాగ్రత్తలు ఆయన వివరించారు. ముందుగా ఆయన పెద్దదేవలాపురం గ్రామంలోని రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి అందులోని రికార్డులను పరిశీలించారు. రైతు సేవ కేంద్రం పరిధిలో తెల్ల పశువులు 190 ,నల్ల పశువుల 534, గొర్రెలు 3000, మేకలు 600 ఉన్నట్లు ఏడిఏ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట పశు సంవర్ధక సహాయకులు జయశ్రీ, అర్జున్ తదితరులు ఉన్నారు.

## దళిత మాదిగలకు రక్షణ కల్పించాలి

### : ఎమ్మార్పీఎస్ ఐక్యత మహాసభ డిమాండ్

### టీఎం రమేష్ కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్గ్రేషియా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 25)**
కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) సంఘాల ఐక్యత మహాసభ నిర్వహించారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ హత్యకు గురైన నేపథ్యంలో ఈ నిరసన సభను ఏర్పాటు చేశారు.సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ, మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన మాదిగ దండోరా ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిందన్నారు. అయితే కొందరు స్వలాభం కోసం ఉద్యమాన్ని ఉపయోగించుకుంటూ మాదిగలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలతో చేతులు కలుపుతున్నారని ఆరోపించారు.అగ్రవర్ణాల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, ఐదు ఎకరాల భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం కేటాయించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాదిగలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.
ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో మాదిగలపై హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రక్షణ కల్పించడంలో విఫలమైందని విమర్శించారు.ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ మాట్లాడుతూ, టీఎం రమేష్ హత్య జరిగి దాదాపు నెల రోజులు గడిచినా కుటుంబానికి సరైన రక్షణ, ఆర్థిక సాయం అందలేదని పేర్కొన్నారు. కుటుంబ జీవనోపాధి దృష్ట్యా ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని కోరారు.



ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు మాదిగ మాట్లాడుతూ, మాదిగలపై దాడులు కొనసాగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. హత్యలు, అత్యాచారాలకు గురైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
ఎమ్మార్పీఎస్ మహిళా నాయకులు అడ్డాకుల నాగేశ్వరి, రెడ్డిపోగు కళావతి మాదిగలు మాట్లాడుతూ, మాదిగలంతా ఏకమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు మహిళలు కూడా ఉద్యమాల్లో ముందుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో టీఎం రమేష్ కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, నగర స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు వర్మి కంపోస్ట్ సొంతంగా తయారు చేసుకోవచ్చు



**చిప్పగిరి, ఫిబ్రవరి, 25,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు శ్రీనివాస వర్మీ కంపోస్ట్ యజమాని నారాయణస్వామి రైతులందరూ వర్మి కంపోస్ట్ సొంతంగా తయారు చేసుకోవచ్చని శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు, ఆయన మాట్లాడుతూ రైతులు వర్మి కంపోస్ట్ సొంతంగా తయారు చేసుకోవడం ద్వారా వారి పంటలకు వాడుతూ ఇతరులకు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని 90 రోజులకు 1200 కేజీల ఎరువు ద్వారా సుమారు 5000 రూపాయలు ఆదాయం వస్తుందని తెలిపారు, ఏంఏవో శ్రీరామ్ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తద్వారా మీ భూమి రికార్డులు వివరాలు ధ్రువీకరించి ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులు అవుతారని కోరారు, ఈ కార్యక్రమంలో హెచ్ఓ ఇందిర, ఏఈఓ రమాదేవి, ఆర్ఎస్కే సిబ్బంది, రైతులు, తదితరులు ,పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ఎర్రకోట రాజీవ్ రెడ్డితో సాధ్యం

### మూగతి గ్రామ వైసీపీ అధ్యక్షురాలుగా బోయ బజారమ్మ



**ఎమ్మిగనూర్, ఫిబ్రవరి, 25 ( రిపబ్లిక్ న్యూస్ ):**
ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని నందవరం మండలం, ముగతి గ్రామ కమిటీలను సచివాలయం వన్ అధ్యక్షురాలుగా బోయ బజారమ్మ గారు, సచివాలయం టు పురుషోత్తం రెడ్డి గ్రామ అధ్యక్షులుగా, రైతు కమిటీ అధ్యక్షులుగా బాబయ్య మిన్నల్లా, బీసీ కమిటీ అధ్యక్షులుగా నాగేష్ నాయుడు, యూత్ కమిటీ అధ్యక్షులుగా దొడ్డి చాందు, విద్యార్థి కమిటీ అధ్యక్షులుగా వాల్మీకి బోయ దస్తగిరి,మహిళా కమిటీ అధ్యక్షురాలుగా పార్వతి, మైనార్టీ కమిటీఅధ్యక్షులుగా మాచపురశీ ఖాదర్ బాషా, సోషల్ మీడియా అధ్యక్షులుగా కుమ్మరివెంకటేష్, ఎస్సీ కమిటీ అధ్యక్షులుగా హనుమంతు, జీవరత్నం ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి కె.ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నందవరం మండలం ముగతి గ్రామ రెండు కమిటీలను ఏర్పాటు చేస్తూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజీవ్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు తెలియజేశారు.

## శ్రీ ఉరుకుంద దేవస్థానం డైరెక్టర్ గా రచ్చమర్రి మేకల క్రిష్ణవేణి



**మంత్రాలయం, ఫిబ్రవరి, 25,(రిపబ్లిక్ న్యూస్ ):** ఈ రోజు కౌతాళం మండలం నందు ఉరుకుంది లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో డైరెక్టర్ గా రచ్చుమర్రి గ్రామ నివాసనికి చెందిన, మేకల కృష్ణవేణి భర్త మేకల చిదానంద ( భార్య ) నియమితులయ్యారు, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది, మా ఇంటి కుల దేవుడు అయిన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి భక్తులుగా దేవస్థానం ట్రస్ట్ డైరెక్టర్ గా నియమించినందుకు సంతోషిస్తూ.. ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది,మాకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి మరియు మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి కి ఉరుకుంద ఈరన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పాండురంగయ్య శెట్టి కి మరియు పూజారి ప్రదాన అర్చకులు వీరన్న స్వామికి టెంపుల్ డిప్యూటీ కమిషనర్ ఈఓ కే .వాణి కి కృతజ్ఞతలు తెలుపుతూ... రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీకి కోసం మరింత కష్టపడి పని చేస్తానని తెలియజేశారు

# జనసేన ఇన్చార్జి వాల్మీకి బి.లక్ష్మన్న ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరికలు.





**మంత్రాలయం, ఫిబ్రవరి, 25,(రిపబ్లిక్ న్యూస్ ):** కౌతాళం మండలం అగసుల దిన్నె గ్రామ ప్రజలు దాదాపు 25 కుటుంబాల ప్రజలు మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బీ లక్ష్మణ ఆధ్వర్యంలోజనసేన పార్టీలో చేరారు.జనసేన పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కె పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి జనసేన పార్టీలో చేరుతున్నట్లు 25 కుటుంబాల సభ్యులు ప్రకటించారు. మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న జనసేన పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.ముందుగా మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్నను కౌతాళ మండలం అగసనూరు గ్రామ ప్రజలు శాలువతో సన్మానించి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో ఒకపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వాల్మీకి బీ లక్ష్మణ తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం లో జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అండగా ఉంటానని మంత్రాలయం జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న తెలిపారు. ఎల్లవేళల జనసేన పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని వాల్మీకి బి లక్ష్మణ తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం లో జనసేన పార్టీని బలోపేతం చేస్తున్నట్లు మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు నాగరాజు, మునిస్వామి, దావీద్, పేత్రయ్య, తిక్క స్వామి, పామన్న, బుడదొడ్డి, రాముమరియు ప్రజలు పాల్గొన్నారు.

## గుత్తి రెడ్డి రిషిత రెడ్డి శశిభూషణ్ రెడ్డిల వివాహానికి హాజరైన ఎక్స్ ఎమ్మెల్యే కొరముట్ల.





**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లె మండలం మంగంపేట కాపు పల్లెకు చెందిన రైల్వే కోడూరు నియోజకవర్గం సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకుడు గుత్తిరెడ్డి హరినాద్ రెడ్డి అన్న కుమార్తె రిషితా రెడ్డి శశిభూషణ్ రెడ్డి ల వివాహం బుధవారం కడప డిఎస్ఆర్ ప్యారడైజ్ కళ్యాణమండపంలో అంగరంగ వైభవంగా జరిగినది, ఈ వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి రైల్వే కోడూరు నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సతీష్ రెడ్డి,మాదినేని వెంకట్ రెడ్డి,సర్పంచ్ రఫీ, ఎంపీటీసీలు, జనార్దన్ రాజు,బండారు మల్లికార్జున, సాయిగణేష్,ఆదినారాయణ,లు ఈ వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు,

## ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సహాయం. ముక్కా రూపానంద్ రెడ్డి.





**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారి పల్లి మండలం వై కోట పంచాయతీ బాల్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగేళ్ల అమర్నాథ్ రెడ్డి ఫిబ్రవరి 12వ తారీఖున ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నారు, కూడా చైర్మన్ రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి బుధవారం బాలిరెడ్డిపల్లె గ్రామంలోని ఆయన స్వగృహానికి చేరుకొని ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడుగు తెలుసుకొని ఆయనకు ముక్కా రూపానంద్ రెడ్డి ఫౌండేషన్ తరఫున 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు తెలుగుదేశం ప్రభుత్వం మీ కుటుంబానికి అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు, అనంతరం అటవీ అధికారులను కలిసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు

# గంజాయి అక్రమ రవాణా.... ఇద్దరు అరెస్ట్

### రెండు కిలోల గంజాయి స్వాధీనం -ఎస్డిపిఓ ఎం.జావళి

### ఇన్స్పెక్టర్ జి.సుధాకర్ రెడ్డిని, వారి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం గాంజా, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ "వజ్ర ప్రహార్" అను కార్యక్రమంలో గంజాయి అక్రమ రవాణాలో ఇద్దర్ని అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్డిపిఓ ఎం.జావళి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ, వారి సిబ్బంది కలిసి, విశ్వసనీయ సమాచారం ఆధారంగా జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి ఉంచాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఈనెల 24వ తేదిన జగజ్జనని నగర్, చెరువుకట్ట, మల్లెలమ్మ గుడి వెనుక ప్రాంతంలో దాడి నిర్వహించగా దాసరి కళ్యాణ్, మాందాపురం మనోహర్ అను వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు రెండు కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుసున్నారు. వారి ఇద్దరిలో ఒకరైన దాసరి కళ్యాణ్ పై గతంలో సారాయి కేసు కూడా ఉందన్నారు. గత కొద్ది రోజుల క్రితం నుండి వారు మద్యం త్రాగడము, గంజాయి ఇతర చెడు అలవాట్లకు



లోనై, జల్సాలు చేస్తూ, గంజాయి సేవిస్తూ తిరుగుతూ ఉండేవారని ఆ క్రమంలో వారు అప్పుడప్పుడు గంజాయి కోసం వైజాగ్ దగ్గర గల అరకుకు వెళ్ళి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కేజి రూ.4 వేలకు కొనుగోలు చేసి నంద్యాలకు తెచ్చుకొని వారు ఇద్దరు సమానంగా గంజాయి పంచుకొని, ఇక్కడ 10 గ్రాముల ప్రకారము చిన్న చిన్న ప్యాకెట్స్ గా తయారు చేసి, 100 గ్రాముల ప్యాకెట్ సుమారు రూ.2000/- చొప్పున అధిక లాభం వచ్చేలా నంద్యాల టౌన్లో కాలేజీ విద్యార్థులకు, సాధువులకు, పట్టణ పరిధిలో అక్కడక్కడ గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. గంజాయి విక్రయాన్ని అడ్డుకుని నిందితులను పక్క సమాచారంతో పట్టుకున్న నంద్యాల ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ జి.సుధాకర్ రెడ్డిని, వారి సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలకు, విద్యార్థులకి పోలీసుల శాఖ తరుపున సందేశం**

గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం చట్టవిరుద్ధం. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు వారి వారి విద్యార్థులకి తరచుగా మత్తు పదార్థాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి. "మాదకద్రవ్య రహిత సమాజం కోసం పోలీసులతో కలిసి ముందుకు రండి అని ఎస్డిపిఓ ఎం.జావళి కోరారు.

# ఉయ్యాలవాడలో మామిడి తోటల పరిశీలన

### పురుగుల నివారణకు సూచనలు, ఫ్రూట్ కవర్లపై 50% రాయితీ

**ఓర్వకల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

బుధవారం రోజు ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామం లోని మామిడి తోటలను జిల్లా ఉద్యాన అధికారి రాజా కృష్ణా రెడ్డి మరియు ఉద్యాన అధికారి, శ్రీమతి అనూష సందర్శించడం జరిగింది. మామిడి తోటల్లో ఈ సంవత్సరం పూత బాగా వచ్చినప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా తేనెమంచు పురుగు మరియు తామర పురుగులు ఆశించడం మూలాన పూత రాలడం జరుగుతోంది. తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా లాంబ్డా సైలోత్రిన్ 5 జుజ 1 మి.లీ మరియు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే బుప్రోఫెజిన్ 20% + ఆసిఫేట్ 50% ఝజూ కలిగి ఉన్న మందును 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. తామర పురుగు నివారణకు వేపనూనె 3000 జూజూఎ 2 మి.లీ లేదా ఆసిఫేట్ 75





ఝజూ 1 గ్రా మరియు పురుగు ఉధృతి కొనసాగితే 15 నుండి 20 రోజుల తర్వాత ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

అంతే కాకుండా పిందె గోలీ+ సైజు ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టుకుంటే చీడపీడలు ముఖ్యంగా పండు ఈగ మరియు మంగు ఆశించకుండా ఉంటుందని కాయ మంచి నాణ్యత కలిగి మార్కెట్ లో ఎక్కువ ధర పలుకుతుందని వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా మామిడి ఫ్రూట్ కవర్లు 50 శాతం రాయితీ తో అందించడం జరుగుచున్నదని. ఒక కవరు ధర రూ. 2/- కాగా రూ. 1/- తిరిగి రైతు ఖాతాలో జమ అవుతుందని ఎకరాకు 6000 కవర్ల చొప్పున 5 ఎకరాల వరకు రాయితీ పొందడానికి రైతుకు అర్హత ఉంటుందని. కనిష్టంగా 1/2 ఎకరా అనగా 3000 కవర్ల నుండి రైతులు ఈ పథకానికి అర్హులని తెలియజేయడం జరిగింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు అనిత మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు

## మొదటి రోజు ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు


### -ఇంటర్మీడియట్ విద్యాధికారి- మాధవి





**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్** ఈరోజు జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర తెలుగు,హిందీ , ఉర్దూ, సంస్కృతం , అరబిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. మొదటి సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగం లో 6035 గాను 6021 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 625 గాను 601 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో మొదటి రోజు హాజరు శాతం 99.42 % గా నమోదైంది. ఈ సంవత్సరం ఐదు నిమిషాలు నిబంధన అమలు లో ఉండటంతో విద్యార్థులందరూ సమయానికి పరీక్షా కేంద్రాల కు చేరుకున్నారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పర్య వేక్షించారనీ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# చౌడేపల్లిలో ట్రాఫిక్ గందరగోళం



ట్రాఫిక్ లో ఇరుక్కున్న అంబులెన్స్



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**

మండల కేంద్రమైన చౌడేపల్లి బస్టాండ్ లో ప్రయాణికులు, వాహనదారులు ట్రాఫిక్ కష్టాల్లో మునిగితేలుతున్నారు. ఒకసారిగా బస్టాండ్లో ట్రాఫిక్ అంతరాయం కలిగితే అన్ని వైపులా కిలోమీటర్ పైగా వాహనాలు అయిపోతాయి. ఆర్టీసీ బస్సులు సంబంధిత బస్టాండ్ కి వెళ్తే 19 ట్రాఫిక్ ఇవ్వండి తగ్గుతుందని ప్రజలు అంటున్నారు. బస్టాండ్ సెంటర్లోని అన్ని వైపుల నుంచి వచ్చే బస్సులు ఆపడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఈ ట్రాఫిక్ వలన అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ కూడా ట్రాఫిక్ లో ఇరుక్కుని గమ్యానికి సరైన సమయంకి చేరుకోలేక పోతుందని ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ లో దుకాణదారులు దురాక్రమణలను తొలగిస్తే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందని, ట్రాఫిక్ సమస్యలపై అధికారులు తన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అందోల్ మండలం డాకూర్ గ్రామంలో నూతన సర్పంచ్ బోర్ మోటారు బాగు చేయించి ప్రజలకు మంచినీటి సౌకర్యాలు కల్పించడం జరిగింది



**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్**

అభివృద్ధి లో బాగంగా బుధవారం నాడు డాకూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ వసంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వినీత్ కుమార్ ఆధ్వర్యంలో 11వ వార్డులో ఫ్రెస్సింగ్ చేసిన బోరు బావిలో సింగిల్ పెస్ మెటర్ బిగించడం జరిగింది.గ్రామ సర్పంచ్ వసంత్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ గంగనోల్ల గోపాల్ లు కొబ్బరి కాయలు కొట్టి త్రాగునీటిని బయటకు వదలడం జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ వసంత్ రెడ్డి, గ్రామ పెద్దలు పి. జైపాల్ రెడ్డి గ్రామ అభివృద్ధి లో బాగంగా ఈరోజు మొత్తం 2 కొత్త మోటర్లు, ఫ్రెషింగ్ చేసిన బోరు బావులలో 4 సింగిల్ పెస్ మోటర్లు బిగించి ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చేయడం జరిగింది. గ్రామంలో మునుముందు ఇంకా చాలా అభివృద్ధి పనులు చేయడానికి గ్రామ సర్పంచ్ కి, పంచాయతీ కార్యదర్శి కి తన వంతు కృషి చేస్తానని గోపాల్ ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మురళి, వార్డు సభ్యులు దన్ రాజ్, ఆశారాణీ, మౌనిక, రేణుక, యాదయ్య, కుర్మా సంఘం నాయకులు గడ్డమీది యాదయ్య,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సభ్యత్వ కార్యక్రమం ఒక యజ్ఞం

## అహుడ చైర్మన్ టిసి వరుణ్ -ఇబ్బందులైతే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం :రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

## గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం :హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్

**రిపబ్లిక్ స్పెషల్ స్టోరీ, ఫిబ్రవరి 25, అనంతపురం**
జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం ఒక యజ్ఞమని అహుడ చైర్మన్ టిసి వరుణ్ పేర్కొన్నారు. నేడు అనంతపురం అర్బన్ లో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టి సి వరుణ్ తెలియజేశారు. రామ్ నగర్ నందు యాదవ్ కళ్యాణ మండపంలో బుధవారం అనంతపురం పార్లమెంట్ జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమ సమావేశం నిర్వహించారు.







### గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో చేపట్టనున్నాం

ఈ సందర్భంగా ఆహుడ చైర్మన్ టిసి వరుణ్ మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గ పరిధిలో జనసేన సభ్యత్వాన్ని పార్లమెంట్ ఏడు నియోజకవర్గాల నుంచి ఇన్ చార్జ్ లు, మండల అధ్యక్షులు, గ్రామ నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారన్నారు. ముఖ్యంగా హస్తకళ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్తగా ఆయన్ని పార్టీ అధిష్టానం నియమించిందన్నారు. ఆయన ఆదేశాల మేరకు బ్రహ్మాండంగా జనసేన పార్టీ ముందుకెళుతుందని, రాబోవు 15 రోజుల్లో సభ్యత్వ నమోదు ను గతం కంటే భిన్నంగా రెట్టింపు ఉత్సాహంతో కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. అర్బన్ నియోజకవర్గం లో జనసేన పార్టీ బలంగా ఉందని అందరూ కలిసికట్టుగా ముందుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగా రాబోవు 15 రోజులు క్రమశిక్షణతో అందరినీ కలుపుకొని పార్లమెంటులో ఒక పండుగ వాతావరణంలో సభ్యత్వ కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ ఒక మహా యజ్ఞంలో చేస్తున్నారని ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

### కార్యకర్తకు ఇబ్బందులైతే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జనసేన సభ్యత్వం కోసం హరిప్రసాద్ నాయకత్వంలో జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఈ యొక్క గొప్ప అవకాశాన్ని ప్రజలు కార్యకర్తలు వినియోగించుకోవాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారన్నారు. రూ. 500 సభ్యత్వాన్ని రూ. 400 చేసి ఎవరికైనా ఇబ్బందులు అయితే పార్టీ నుంచి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినటువంటి గొప్ప మనసున్న వ్యక్తి పవన్ కళ్యాణ్ గారని ఆయన కొనియాడారు. ఈరోజు ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు చేశారని, దేశంలో మరెక్కడా జరగలేదని, అటువంటి కార్యక్రమం ఒక జనసేనలోనే కొనసాగిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో అనంతపురం పార్లమెంటులో టిసి వరుణ్ నాయకత్వంలో
గతం కంటే వేలాదిగా మూడింతలు రెట్టింపు పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అయితే జిల్లాలో ఎక్కడా 10,000 కు తప్పకుండా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తామని భావిస్తున్నానన్నారు. ఒక మంచి ఉద్దేశంతోనే జనసేన పార్టీని కొణిదెల పవన్ కళ్యాణ్ స్థాపించారన్నారు. ఉన్నతమైన సినీ జీవితాన్ని పక్కనపెట్టి ఒక దుర్మార్గమైన వైసీపీ పాలన అంత పొందించాలని చెప్పి రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ఆయన ఎంతో వేయ ప్రయాసలు కూర్చి పార్టీని ముందుకు నడిపిస్తున్నారని ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వామిలవ్వాలని సూచించారు. జిల్లాలో గ్రామ గ్రామాన సభ్యత్వం చేయాలని పలానా గ్రామంలో సభ్యత్వం లేదనకూడదని ప్రతి గ్రామం ప్రతి వార్డులో సభ్యత్వ నమోదు చేస్తామని చెప్పారు. ఏ నియోజకవర్గాల్లో కూడా పదివేలకు తక్కువ కాకుండా సభ్యత్వ నమోదుకు కృషి చేస్తారని కోరారు. పవన్ కళ్యాణ్ అంత బాధ్యతగా చెప్పినప్పుడు నాయకులు, కార్యకర్తలు వేదవాక్యంగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామన్నారు.

### ప్రతి గ్రామంలో రోడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు

హస్తకళ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనంతపురం పార్లమెంట్లో దిగ్విజయంగా జనసేన ఉద్యమి పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్షుడు టిసి వరుణ్ గారి ఆధ్వర్యంలో పీఏసీ సభ్యులు చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్చార్జ్ లు, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ లు, రాష్ట్ర చైర్మన్లు, వీర మహిళలు, మండల అధ్యక్షులు అందర్నీ కూడా బుధవారం సమావేశపరిచి అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి అనంతపురం పార్లమెంటు జనసేన నాయకులు తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన ఆశయాలతో జనసేన పార్టీని మొదలుపెట్టారన్నారు. మొదటి ప్రాధాన్యత కార్యకర్తేనని నాయకులు కాదని ఆయన తెలిపారు. పంచాయతీ శాఖలో ఒకరోజు 40 వేల మందికి పదోన్నతి కల్పించిన అద్భుతమైన నాయకుడు పవన్ కళ్యాణ్ గారిని కొనియాడారు. 13326 పంచాయితీల్లో ఒకేరోజు గ్రామ సభలో నిర్వహించి గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులేసారన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసినటువంటి నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు.

### స్మగ్లింగ్ చేయాలనే వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాడు

గత వైసిపి ప్రభుత్వంలో రెడ్ శాండిల్ స్మగ్లింగ్, అడవులు ఆక్రమణ జరిగిందన్నారు. వీటిని కట్టుదిట్టం చేసి ఈరోజు ఎవరైనా అడవులను ఆక్రమించుకోవాలన్నా, స్మగ్లింగ్ చేయాలన్న వాళ్ళ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ ఆ యొక్క శాఖలో పవన్ కళ్యాణ్ అడుగులు ముందుకేస్తున్నారు అన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమ వైపు పరిగెత్తిస్తున్నారని గిరిజన ప్రాంతాలకు ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ సౌకర్యం కల్పించి మాట నిలబెట్టుకున్నారన్నారు.

### పరిపాలనను చూసి ప్రతి ఒక్కరూ ఆకర్షితులయ్యారు

రోడ్లు లేక డోలిలో మోసుకెళ్తున్న గిరిజనుల పరిస్థితులు నుంచి అరకులో గ్రామ గ్రామానికి రహదారులను నిర్మిస్తున్నారని, యువత, మహిళలు, ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్ ప్రణాళికతో ముందుకు అడుగులేస్తున్నారని రాజకీయాలలో తనదైన మార్కును చూపించారని, రాష్ట్రం దేశ భవిష్యత్తు కోసం కృషి చేస్తున్నారన్నారు. 2014లో ఒకరితో మొదలైన పవన్ కళ్యాణ్ రాజకీయ నడక ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికి విద్యార్థులు యువకులు, పరిపాలన దక్షతను చూసి ప్రతి ఒక్కరూ ఆకర్షితులయ్యారని తెలియజేశారు. పల్లె, పంచాయితీ, మండలం, నియోజకవర్గస్థాయికి పల్లెని జనసేన కార్యకర్తలు నాయకులు టచ్ చేయబోతు న్నారన్నారు. జనసేన సభ్యత్వ నమోదును పల్లె పల్లెకు తీసుకురావడానికి ప్రతి పంచాయతీ మండలం నుంచి సర్వసభ్య సమావేశానికి తరలి రావడం చాలా సంతోషించారు. అత్యధిక సభ్యత్వం నమోదులో అనంతపురం జిల్లా ముందు ఉంటుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు, జనసైనికులు, నాయకులు, మండలాధ్యక్షులు, కార్పొరేట్ డైరెక్టర్లు, నియోజకవర్గ ఇన్చార్జ్ లు, మార్కెట్ యాడ్ చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలోని ట్రెండ్ సెట్టర్ జిమ్ లో తెలంగాణ రా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో, డబల్యూ ఆర్ పి ఎఫ్ ఏషియన్ ఛాంపియన్షిప్ కొరకు పవర్ లిఫ్టింగ్ సెలక్షన్ ట్రయల్

**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 25( రిపబ్లిక్ న్యూస్)**
ఈ సెలక్షన్ ట్రయల్ టి ఆర్ పి ఏ చైర్మన్ పున్నా రమేష్ మరియు రాష్ట్ర అధ్యక్షులు సుంకు హరిబాబు గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సెలక్షన్ ట్రయల్లో బంగారు పథకాలు సాధించిన సుంకు కారుణ్య, ఏ.అనిష్క, సుంకు హర్షవర్ధన్ రావు లను మరియు తదితరులను హరిబాబు గారు ఢిల్లీకి తీసుకువెళ్లారు.
ఈ నెల 21 మరియు 22 నాడు ఢిల్లీలోని షా ఆడిటోరియంలో డబ్ల్యూ ఆర్ పి ఎఫ్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఏసియన్ ఛాంపియన్షిప్ నిర్వహించడం జరిగింది.
ఈ ఛాంపియన్షిప్ లో రామచంద్రాపురం కి చెందిన సుంకు హర్షవర్ధన్ రావు టీన్ కేటగిరీలో పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం కైవసం చేసుకోవడం జరిగింది.




అదే రామచంద్రాపురం కి చెందిన సుంకు కారుణ్య జూనియర్ కేటగిరీ పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. తెల్లాపూర్ విద్యుత్ నగర్ కు చెందిన ఏ. అనిష్క కూడా జూనియర్ కేటగిరీ పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు.
కారుణ్య హర్షవర్ధన్ల తండ్రి అయిన సుంకు హరిబాబు మాస్టర్ కేటగిరీ పవర్ లిఫ్టింగ్ లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఒకే ప్రాంతం నుండి ముగ్గురు పిల్లలు ఢిల్లీకి వెళ్లి అంతర్జాతీయ ఛాంపియన్షిప్ లో బంగారు పథకాలు కైవసం చేసుకోవడం చాలా గర్వంగా ఉందని రామచంద్రాపురం వాసులు, విద్యుత్ నగరవాసులు, బహుజన్ సమాజ్ పార్టీ పటాన్చెరు అసెంబ్లీ ఇన్చార్జ్ శంకు వినయ్ కుమార్, అసెంబ్లీ అధ్యక్షులు పడమటి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సీనియర్ నాయకులు కావలి సంజీవ, జనార్ధన్ మరియు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వాళ్లు వాళ్ల జీవితంలో ఇంకా ఇలాంటి పథకాలు ఎన్నో సాధించాలని కోరారు.




# అల్మాయిపేట గ్రామ పిల్డ్ అసిస్టెంట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ల పై చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాల్రాజ్ ను కలిసి రిపబ్లిక్ రిపోర్టర్వినతి పత్రం**

**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 25( రిపబ్లిక్ న్యూస్**
ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒకరి పేరు ఒకరు పని చేయకూడదని గట్టిగా నిబంధనలు ఉన్నప్పటికీ గ్రామంలో గత నెల రోజుల క్రితం నుంచి అసలే పనికి రానటువంటి వ్యక్తిపై వేరే వ్యక్తి పని చేస్తూ పనిచేయని వ్యక్తిపై పేమెంట్ ఐతున్నట్టు గ్రామ పీల్డ్ అసిస్టెంట్ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారి ఇద్దరి కనుసన్నల్లో ఈ పని జరుగుతుందని నిర్ధారణ అయినప్పటికీ ఇలా జరుగుతుందని మా దృష్టికి రాగానే స్థానికంగా ఉన్న ఎంపీడీవో గారికి ఫిర్యాదు చేయగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ అదేవిధంగా పంచాయతీ సెక్రటరీకి అడగగా నాకు తెలియదు తనపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉంటుంది అని తెలియపరుస్తూ ఎలాంటి సరైన సమాధానం తెలపకపోవడంతో స్థానికంగా గ్రామానికి చెందిన ఒక వ్యక్తిగా ఒక బాధ్యత గల పౌరుడిగా ఈరోజు సంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి బాలరాజ్ కలిసి స్థానికంగా ఉన్నటువంటి ఇలాంటి పరిణామాలు ఎన్నో జరిగినప్పటికీ వాటికి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేసినప్పుడు తో తో మంత్రంగా వదిలేసుకుంటూ వస్తున్న సందర్భాల్లో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒకరి పేరు పైన ఒకరు పని చేయకూడదని తెలిసినప్పుడు కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం అనకుండా యువర్ ఏం చేస్తారో చేసుకోండి అని ఒక సంకేతాన్ని వెలుపరిచే విధంగా ఆయన పని విధానంలో ఉన్నది కాబట్టి ఈరోజు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కి వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది



# స్పోర్ట్స్ మీట్ లోపాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## క్రికెట్, త్రోబాల్, టెన్నికాయిట్ ,షటిల్ ఆడిన పల్లె సింధూర






**ఉమ్మడి అనంతపురం స్పోర్ట్స్, ఫిబ్రవరి 25,(రిపబ్లిక్ న్యూస్):**
విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 2026 శాసన సభ్యుల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఎంతో ఉత్సాహంగా , ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొన్నారు.
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం శాప్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 క్రీడా పోటీలు జరిగాయి. క్రీడా పోటీల్లో ఆమె అత్యంత ప్రతిభను కనబరిచి పలు క్రీడల్లో విజయం వైపు దూసుకెళ్తున్నారు. బుధవారం జరిగిన క్రీడా పోటీల్లో పల్లె సింధూర రెడ్డి తో పాటు జిల్లాకు చెందిన పరిటాల సునీత ,శ్రావణి ,సత్య కుమార్ యాదవ్, తదితరులు పలు క్రీడల్లో ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

### ఉత్సాహంగా .. ఉల్లాసంగా క్రీడా పోటీలు

పల్లా శ్రీనివాస్– సత్యకుమార్ యాదవ్ టీం మధ్య క్రికెట్ పోటీ జరగ్గా ఈ మ్యాచ్ ప్రత్యేక అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఎమ్మెల్యేలు పరిటాల సునీత ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లు బ్యాట్ పట్టి ఒక బాల్ ఆడి ఇలా ఆడాలని మిగతా జట్టు సభ్యులకు సూచించారు.త్రో బాల్ పోటీలు పరిటాల సునీత వర్సెస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి టీమ్ తలపడ్డాయి. ఈ పోటీల్లో పరిటాల సునీత టీం విన్నర్ గా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి టీం రన్నర్ గా నిలిచారు.
టెన్నికాయిట్ సింగిల్ పోటీలో ఎమ్మెల్యేలు సింధూర రెడ్డి, ఎమ్మెల్యే పరిటాల సునీత మధ్య జరిగాయి.ఈ పోటీలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి గెలుపొందారు.
టేన్నికాయిట్ డబుల్స్ లో పల్లె సింధూర రెడ్డి,విజయశ్రీ, జగదీశ్వరి ,పద్మశ్రీ మధ్య జరిగిన టెన్నిస్ కాట్లో పల్లె సింధూర రెడ్డి,విజయశ్రీ రన్నర్ గా నిలిచారు.
షటిల్ లో.. పల్లె సింధూర రెడ్డి వర్సెస్ కావలి గ్రీష్మ మధ్య షటిల్ పోటీ ఆసక్తికరంగా సాగింది. ఈ పోటీలో కావలి గ్రీష్మ విన్నర్ గా పల్లె సింధూర రెడ్డి రన్నర్ గా నిలిచారు. బ్యాడ్మింటన్ పోటీల్లో పల్లె సింధూర రెడ్డి వర్సెస్ క్రి పద్మశ్రీ మధ్య ఎంతో ఉత్కంఠ పోరు సాగింది. ఇందులో క్రీ పద్మశ్రీ విన్నర్ గా పల్లె సింధూర రెడ్డి నిలిచారు.

### క్రీడలు స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొల్పుతాయి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించడం కోసం క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీ అందరూ ఒకచోట ఇలా క్రీడా పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడలు స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొల్పడానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర అద్భుత విజయాలు సాధించారు.

# రంగంపేట లో రంగనాయక స్వామి ఉత్సవాలు

## భజన మండలి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి

## శ్రీ మాధవ నంద సరస్వతి స్వామి పర్యవేక్షణ లో పూజల నిర్వహణ

**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25( రిపబ్లిక్ న్యూస్)**
మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటవాణిజ్య వ్యాపార కేంద్రమైన రంగంపేటలో 17 వందల శతాబ్దంలో రెడ్డి రాజుల కాలంలో నిజాం రాజులచే ఆడపులిగా పిలవబడ్డ రాణి శంకరమ్మ దత్తత పుత్రుడైన సదాశివరెడ్డి కాలంలో ఆలయం నిర్మించబడినదిగా చరిత్ర ద్వారా తెలియవ స్తుంది. ఇక్కడి స్వామి వారి విగ్రహం పూర్తిగా శ్రీరంగంలోని స్వామివారిని పోలి ఉండడం కనిపిస్తుంది. స్వామి వారి పక్కనే 12 మంది ఆళ్వార్లు కనిపిస్తారు. శ్రీరంగం నుంచి మహా ప్రసాదాన్ని తీసుకువచ్చి, అఖండ దీపములచే స్వామివారిని నెలకొల్పారు.పూర్తి రాతి కట్టడం దంగు సున్నంతో నిర్మించబడ్డ దేవాలయం కొంతమేర దెబ్బ తినడం జరిగింది.దీంతో భక్తుల సహకారంతో రంగనాయక భజన మండలి, ఆలయ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేపట్టి పునర్నిర్మాణం గావించారు. లి పూజా కార్యక్రమాలు.. సంప్రోక్షణ కార్యక్రమం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం పూజారుల ద్వారా పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 26 గురువారం న గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు హోమం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుంది. 27 న శుక్రవారం వేద పారాయణం ద్వారా తోరణ, విష్ణు సహస్ర పారాయణం పూజాది కార్యక్రమాలు.28 న శనివారం ధ్వజ కుంభ ఆరాధన, మహా పూర్ణాహుతి, విగ్రహ మూర్తి స్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి మూడు రోజుల పాటు నిత్య హోమం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



రిపబ్లిక్



# వారం నుండి డాక్టర్ లేదు..

# ఇబ్బందులల్లో రోగులు

## ల్యాబ్ రిపోర్ట్స్ కోసం వారాల తరబడి ఆలస్యం



వారం నుండి ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



ఆళ్లగడ్డకు చెందిన చికిత్స వచ్చిన మహిళ

**నంద్యాల, ఫిబ్రవరి 25, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం ఓపి సమయంలో ఉండవలసిన డాక్టర్ లేకపోవడంతో ఆళ్లగడ్డ నుండి నంద్యాలకు వారం రోజులుగా వస్తున్నామని రోగులు తెలిపారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి జిజిహెచ్ గా మారిన అనంతరం వైద్యుల కొరతతో రోగాలతో బాధపడుతూ ఇక్కడకు వచ్చిన రోగులకు జిల్లా ఆసుపత్రి కి తిరగలేక చుక్కలు కనిపిస్తున్నాయి బుధవారం చికిత్స కొరకు వచ్చిన ఆళ్లగడ్డ చెందిన మహిళ ప్రతిరోజు ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమిస్తున్నాయని, సిబ్బంది మాకు తెలియదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులలో వేల రూపాయలతో కూడిన చికిత్సలు చేయించుకునే స్తోమత లేక ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం వస్తుంటారు. సదరు డాక్టర్లు రోగులకు అందుబాటులో లేకపోవడం రోగులు వారి వెంట వచ్చిన వారు వారాల పడి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యం కోసం తిరుగుతూ జబ్బు ముదిరిపోయి నిరాశతో ప్రవేట్ ఆసుపత్రిల పాలిట పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో చాల వారు పేదలు ఉంటారు. వారిలో కొంత వారు పూట కుడా గడువని వారు ఉంటారు. పని చేస్తున్న తినాలి లేదంటే పస్తులు ఉండాలి అనే పరిస్థితి ఉంటుంది. అలాంటి వారి సమయానికి డాక్టర్లు అందుబాటులో లేకపోతే వారి పరిస్థితి ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు అయిన సదరు డాక్టర్ లేకపోయిన ఓపిలు ఇచ్చేవారు ఎలా ఆ డాక్టర్ గది నెంబర్ రాసి వారిని సూచిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే అధికారులకు, సిబ్బందికి, ఓపిలు ఇచ్చే వారికి కుడా తెలియద డాక్టర్ వారం నుంచి లేదు అని తెలియని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు డాక్టర్ సెలవులో ఉన్న మరోక సంబంధిత డాక్టర్ అయిన సమయానికి అందుబాటులో ఉంచి రోగులకు సరైన చికిత్స అందించాలని కోరుతున్నారు

### రిపోర్టుల కోసం వారాల తరబడి ఆలస్యం

డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులను పరిశీలించిన తరువాత వారికి రాసిన పరీక్షలు చేయించుకోవడానికి గంటలు, గంటలు ల్యాబుల చుట్టూ తిరగాలి. రోగులకు చేసిన పరీక్షల నివేదికల కోసం గంటలు, రోజులు, సిటి స్కాన్, (కంప్యూటెడ్ టోమోగ్రఫీ), ఎంఆర్ఐ (మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్), ఎక్స్ రే వంటి నివేదికల కోసం వారాలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఏఐ టెక్నాలజీ ఉన్న సమయంలో కూడా నివేదికలు విజయవాడ నుండి రావాలి, సర్వర్ రావడం లేదు. రోగులు ఎక్కువ మంది ఉన్నారని సంబంధిత సిబ్బంది సాకులు చెబుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు. కేవలం జిల్లా ఆసుపత్రిగా మార్చిన అధికారులు రోగులు పెరుగుతూ ఉంటే తగిన సదుపాయలు కల్పించేలా జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




నంద్యాల జిల్లా సర్వజన ఆసుపత్రి

### వారం నుండి తిరుగుతున్నాం సదరు డాక్టర్ లేదు -బాధిత మహిళ

జిల్లా సమీపంలోని ఆళ్లగడ్డ చెందిన మహిళ న్యూరాలజీ డాక్టర్ వద్ద చికిత్స కొరకు వారం నుండి ఆళ్లగడ్డ టూ నంద్యాల వైద్యుడు అందుబాటు లేదని తిరిగి నంద్యాల టు ఆళ్లగడ్డ వెళ్తున్నాను. గత వారం నుండి పరిస్థితి ఉంది. అక్కడి సిబ్బంది ప్రశ్నించగా మాకు తెలియదని అంటూన్నారు. సంబంధిత వైద్యులు లేనప్పుడు ఎందుకు ఓపి ఇస్తున్నారు. ఈ సమయం వరకు వారు రారని చెబితే సరిపోతుంది. కాకపోతే ఒక డాక్టర్ లేకపోతే మరోక డాక్టర్‌ను ఏర్పాటు చేయలేరా.. పేరుకు మాత్రమే జిల్లా, జిల్లా ఆసుపత్రి.

# రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నగదు రహిత వైద్య సహాయం

## పీఎం రాహత్ పథకాన్ని విస్తృతంగా వినియోగించాలి

**రవాణాశాఖ అధికారి, మునిసిపల్ కమిషనర్లు, రోడ్లు భవనాలు శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులను సూచించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 25 రిపబ్లిక్ న్యూస్** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ, నగదు రహిత వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి, మునిసిపల్ కమిషనర్లు, రోడ్లు మరియు భవనాలు శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తొలి 7 రోజుల్లో ఒక్కొక్కరికి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించబడుతుందని కలెక్టర్ తెలిపారు. పోలీసుల ధృవీకరణ అనంతరం సాధారణ గాయాల కేసుల్లో 24 గంటల పాటు, తీవ్ర గాయాల కేసుల్లో 48 గంటల పాటు స్థిరీకరణ వైద్య సేవలు అందించబడతాయని వివరించారు. ఈ పథకం కింద ఆసుపత్రులకు చెల్లింపులు మోటారు వాహన ప్రమాద నిధి ద్వారా చేయబడతాయి. ప్రమాదానికి కారణమైన వాహనం బీమా చేయబడినట్లయితే బీమా సంస్థలు వ్యయాన్ని భరిస్తాయి. బీమా చేయని వాహనాల సందర్భంలో, భారత ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ద్వారా ఖర్చును భరిస్తుందని తెలిపారు. ఈ పథకం ప్రజలకు అత్యంత ప్రయోజనకరమని, రోడ్డు ప్రమాదాల అనంతరం బాధితులకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందించడంలో ఇది కీలకంగా పనిచేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి పథకం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాన్ని తగ్గించడంలో అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

## జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



**గుత్తి ఫిబ్రవరి 25 (రిపబ్లిక్ న్యూస్)**అనంతపురం జిల్లా గుత్తి పట్టణం లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం ఎంపీడీవో కార్యాలయం వెనుక ఉన్న భవనాలను జిల్లా జాయింట్‌కలెక్టర్ విష్ణు చరణ్ బుధవారం పరిశీలించారు. గతకొన్నేళ్లుగా ఫైర్ స్టేషన్ లేక రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ నిర్ణయంతీసుకుంది. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, ఫైర్ ఆఫీసర్ అశ్వర్థ ఆర్ ఐ హనుమాన్ ప్రసాద్ విఆర్ఓ సురేంద్ర పాల్గొన్నారు.

# ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రేప్యుటేషన్ దెబ్బతీసే వారిపై చర్యలు తప్పవు



**గుత్తి ఫిబ్రవరి 25 : (రిపబ్లిక్ న్యూస్)** ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రేప్యుటేషన్ దెబ్బతీసిన కస్టమర్ శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్ పై పరువు నష్టం దావా వేస్తున్నామని బ్యాంకు ఛైర్మన్ అబ్దుల్ జిలాన్, డైరెక్టర్లు పేర్కొన్నారు. బుధవారం గుత్తి ఆర్ యస్ లోని కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాసులు లోన్ తీసుకొని డబ్బు చెల్లించకపోవడంతో వేలం వేశామన్నారు. అది మనసులో పెట్టుకుని బ్యాంకు ప్రతిష్ఠను దెబ్బ తీసే విధంగా సోషల్ మీడియాలో బ్యాంకు పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు అనంతరం గుత్తి పోలీస్ స్టేషన్ లో బ్యాంకు ఖాతాదారుడు శ్రీనివాసులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ. బ్యాంకు ఖాతాదారుడు శ్రీనివాసులు తన ఇంటిపై బ్యాంకు లోను తీసుకున్నాడని అయితే సరైన సమయానికి బ్యాంకు లోను చెల్లించకపోవడంతో నోటీసులు ఇచ్చిన తర్వాత ఇంటిని వేలంపాట నిర్వహించామన్నారు. ఆర్బిఐ నిబంధన ప్రకారమే శ్రీనివాసులు ఇంటిని వేలంపాట నిర్వహించామని అయితే శ్రీనివాసులు టౌన్ బ్యాంకు పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు చేసే వారు ఎలాంటి వారైనా సరే ఉపేక్షించలేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హత్య కేసు నిందితుడు అరెస్టు



**అవుకు ఫిబ్రవరి 25 రిపబ్లిక్ (న్యూస్)** నంద్యాల జిల్లా అవుకు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మంగలి శివరాముడు హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతని కుమారుడు మంగలి శేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు అతనిపై సెక్షన్ 302 కింద కేసు నమోదు అయి ఉండడంతో కొంతకాలంగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నంద్యాల జిల్లా కోర్టు అతనిపై అదనంగా మూడు సెక్షన్లు నమోదు చేసి నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది పై అధికారుల ఆదేశాల మేరకు బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ రెడ్డి ఆధ్వర్యంలో అవుకు ఎస్సై జి. అశోక్ తన సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారుపోలీసు బృందాలు బెంగళూరు కర్ణాటక తదితర ప్రాంతాల్లో గాలింపు చేపట్టగా నిందితుడు ఈ నెల 25వ తేదీన సంఘ పట్నం గ్రామ ఊరి వాకిలి వద్ద కనిపించగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు అనంతరం అతన్ని అవుకు పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్కడి నుంచి బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి సమక్షంలో హాజరుపరిచారు

పై అధికారుల ఆదేశాల మేరకు ఎస్సై జి. అశోక్ తన సిబ్బందితో కలిసి నిందితుడిని నంద్యాల జిల్లా కోర్టులో హాజరుపరిచారు

# సోలార్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 25 (రిపబ్లిక్ న్యూస్)** జిల్లాలో అమలులో ఉన్న సోలార్ విద్యుత్ పథకాల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సోలార్ వెండర్లతో కలిసి వివిధ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పీఎం-కుసుమ్-సి పథకం కింద జిల్లాలో చేపట్టిన 9 పనులలో 4 పనులకు ఇప్పటికే స్థలాలు ఖరారు చేసామని మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరారైన 4 పనులకు తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు పగటి పూట నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 117 ఎకరాల విస్తీర్ణంలో 29 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 'వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ ఓ ఏ) జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,595 వ్యవసాయ పంప్‌సెట్లకు నిరంతర సౌర విద్యుత్ సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ & రూఫ్‌టాప్ సోలార్ (ఆర్ టి ఎస్) ప్లాంట్ల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. కెపెక్స్ విధానం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కేటాయించిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని వెండర్లను ఆదేశించారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సిబ్బంది, సోలార్ వెండర్లు సంయుక్తంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణ సౌకర్యాల వివరాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేసి రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్టుల సమర్థ అమలుతో రైతులు, గృహ వినియోగదారులు తక్కువ ఖర్చుతో పునరుత్పాదక శక్తి ఆధారిత నాణ్యమైన విద్యుత్‌ను పొందగలరని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు శాశ్వత విద్యుత్ పరిష్కారాల దిశగా జిల్లా ముందంజలో నిలవాలని ఆమె ఆకాంక్షించారు.

# పెండింగ్ మ్యుటేషన్లను గడువులోగా పరిష్కరించండి

## ప్రజా సేవల్లో 80% సానుకూలత లక్ష్యం -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 25 (రిపబ్లిక్ న్యూస్)** భూసమస్యలకు సంబంధించి పెండింగ్ మ్యుటేషన్లను గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మండల తాసిల్దార్లకు రెఖీవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాల్లో ప్రభుత్వ ఆదేశాల అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ రికార్డుల నమోదు ప్రక్రియను గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ గడువులు దాటకుండా ప్రతి దరఖాస్తును సమయపాలనతో పరిష్కరించాలని తెలిపారు. కోటపాడు వంటి గ్రామాల్లో రికార్డుల నమోదులో చోటుచేసుకున్న పొరపాట్లను గమనించిన కలెక్టర్, బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీలో ఉన్న పెండింగ్‌ను పూర్తిగా క్లియర్ చేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల భావన( ప్రీసెప్షన్) 80 శాతం పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకం కింద అర్బన్ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థల సర్దుబాటు, కొత్త ఇంటి స్థలాల సేకరణపై సమగ్ర నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పని ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే జాయింట్ కలెక్టర్ లేదా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజా సేవలలో పారదర్శకత, వేగం, నాణ్యత ఉండేలా ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్, డిఆర్ఓ రాముూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com